www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 12 | మే | 2025 పేజీలు 8

# మేమేమి చేశాం నేరం..
# మాకెందుకీ శాపం..!





మేము ఖమ్మంజిల్లా నేలకొండ పల్లి మండలం గువ్వల గూడెం గ్రామంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రెండు పడక గదుల ఇండ్లం. మా కోసం ఎదురు చూసే పేదలు నోరున్నా అడగలేకపోతున్నారని అలుసుగా తీసుకున్నారో లేక మరె రాజకీయ కారణమైన ఉందేమో కానీ మమ్మల్ని అసం పూర్తిగా వదిలి వేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి కేసిఆర్ ప్రభుత్వం పేదలకు రెండు పడక గదుల ఇండ్లు నిర్మించే పథకా నికి నాంది పలికింది. అందులో భాగంగా అప్పటి, ఇప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవ, కృషితో 30 రెండు పడక గదుల ఇండ్లను మంజూరు చేయడమే గాక నిర్మాణం చేపట్టారు. తొలి దశలో నిర్మాణ పనులు చకచక పూర్తి చేశారు. 30లో 27 ఇండ్లకు పిల్లర్స్ వేసి శ్లాబులు వేశారు. మరో మూడు శ్లాబు దశకు వచ్చి నిలిచి పోయాయి. ఆ తర్వాత కేసిఆర్ 2018లో తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మా గురించి పట్టిం చుకోలేదు. 2023లో అధికారం చేతులు మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి తుమ్మల నాగేశ్వర రావు తిరిగి మంత్రిగా బాధ్యతలు చేపట్టడమే గాక మేమున్న ఉండే పాలేరు నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివా సరెడ్డి మంత్రి అయ్యారు. 18 మాసాలు గడిచిపోయాయి. మా గురించి పట్టించుకోవడం కాదు కదా అసలు మా వైపే కన్నెత్తి చూడడం లేదు. గూడు లేని నిర్భాగ్యులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ చలికి వణుకుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. మా మధ్యలో పెరిగిన ముళ్ల కంచె వివిధ రకాల చెట్లను తొలగించి మిగిలిన పనులను పూర్తి చేస్తే 30 మంది నిర్భాగ్యులకు మేము ఆశ్రయం కల్పిస్తాం. మా ముందే రేకులు వేసుకుని చుట్టూ పరదాలు కట్టుకుని జీవిస్తున్న పేదలను చూస్తుంటే మా కడుపు తరుక్కుపోతుంది. నిర్జీవులమైన మేము స్పందిం చిన ఏమి చేయలేక పోతున్నామన్న వేదన మా మదిలో నిండుకుంది. మిగిలిన పని పూర్తి చేస్తే పేదలకు ఆధా రంగా ఉండి తిన్నా తినకపోయినా వారికి ఆశ్రయం కల్పించేవారము కదా అని మదన పడుతున్నాం. తెల్లటి సున్నం లేదంటే వివిధ రంగుల్లో కళకళ లాడాల్సిన మేము ముళ్ల కంచెల మాటున మూలుగు తున్నాం. గతం వేరు ఇప్పుడు కోదాడ, ఖమ్మం హైవే నిర్మాణం పూర్తయి హైవే రోడ్డు మా పక్కనుంచే వెళ్తుండడంతో మమ్మల్ని చూసి వీటిని ఇలా వదిలేశారే పూర్తి చేస్తే బాగుంటుంది కదా అని హైవే ప్రయాణికులు అంటుంటే మా ప్రాణం చితుక్కుమంటుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇందులో సగం ఖర్చు చేస్తే చాలు మేము 30 కుటుంబాలకు ఆశ్రయం కల్పిస్తాం. పదేళ్లు మరుగునపడి మదనప డుతున్నాం. ఓ సారి మమ్మల్ని పరిశీలించండి. మా గురించి ఆలోచించండి. నీడ నివ్వని ఎందుకు ఉపయోగప డని బతుకుల్లా మమ్మల్ని కూలిపోనివ్వకండి. మేము చేసిన నేరమేమిటో అర్థంకాక, శాపగ్రస్తులం ఎందుకు అయ్యామో తెలియక ఆవేదన చెందుతున్నాం. నిధులిచ్చి పనులు పూర్తి చేస్తే హైవే పక్కన అందంగా కనపడుతూ పేదలకు గూడు కల్పించిన మీకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉంటాం. మా వేదన విని స్పందిస్తారని ఆశిస్తున్నాం.

విన్రమ విధేయతతో
అసంపూర్తి రెండు పడక గదుల ఇండ్లు
గువ్వలగూడెం, నేలకొండపల్లి మండలం ఖమ్మం జిల్లా

ప్రజాపక్షం

# దొరికిన తిమింగలం..
# దొరకాల్సిన బినామీలు..!

**-జీవన్‌లాల్ వ్యవహారంపై సర్వత్రా చర్చ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇటీవల కాలంలో అవినీతి నిరోధక శాఖాధి కారులకు జూనియర్ అసిస్టెంట్లు లేదా నాల్గవ తరగతి ఉద్యోగులు పట్టుబడితే ఏసిబికి చిక్కిన అవినీతి తిమింగలం ఆనడం అనవాయి తీగా మారింది. రూ. 20వేలు, రూ. 30వేలు ఒక్కో సందర్భంలో ఐదు వేలకు లోబడి లంచం తీసుకుంటూ చిక్కిన పరిక పిల్లలే అవి. దశాబ్ద కాలంగా ఎక్కడలేనివిధంగా రూ. 70 లక్షలు లంచం తీసు కుంటూ మాజీ ఎంఎల్ఎ లావుడ్యా రాములు నాయక్ కుమారుడు ఐఆర్ఎస్ అధికారి లావుడ్యా జీవన్‌లాల్ దొరికిపోయాడు. కేంద్ర పరిశోధన సంస్థ (సిబిఐ) వల పన్ని జీవన్‌లాల్ సహా ఐదుగురిని అదుపులోకి తీసుకుంది. ప్రైవేటు సంస్థకు ఆర్థిక లబ్ది చేకూర్చే క్రమంలో రూ. 70 లక్షలు లంచం తీసుకునే ప్రక్రియలో వారిని అదుపులోకి తీసుకున్నారు.

మిగతా 2లో..

# త్యాగాలకు చిరునామా ప్రకాశరావు కుటుంబం



-భవిష్యత్తు పోరాటాలకు సంస్మరణ సభలు నాంది పలకాలి
-కమ్యూనిజం అజరామరం, విశ్వ వ్యాపితం
-సుశీలమ్మ సంస్మరణ సభలో కూనంనేని
-సుశీలమ్మకు ఘన నివాళి

**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు పేదల పక్షాన నిలిచి అనేక పోరాటాలకు కేంద్ర బిందు వుగా నిలిచిన తూము ప్రకాశరావు కుటుంబం త్యాగాలకు చిరునామాగా నిలిచిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని

మిగతా 2లో..

# సిండికేట్ అంతా 'బాలాజీ' మయం..!



-టేకులపల్లిలో ఇష్టారాజ్యంగా వైన్స్ నిర్వహణ
-వైన్ షాపుల్లో నిల్.. బెల్ట్ షాపుల్లో ఫుల్
-వైన్స్ షాపు నిర్వాహకులను నిలదీసిన మద్యంప్రియులు

2లో

# కొత్తతరహా ఇందిరమ్మ ఇళ్లు..!

- ఇటుకలు, ఇనుము లేకుండా నిర్మాణం
- షెర్‌వెల్ టెక్నాలజీతో ఇంటి నిర్మాణం
- ప్రభుత్వ ధరకే ఇల్లు పూర్తి
- ఆసక్తి చూపుతున్న జనం
- ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- తీరనున్న పేదల సొంతింటి కల



8లో

# త్యాగాలకు చిరునామా ప్రకాశరావు కుటుంబం






(మొదటిపేజీ తరువాయి)

సాంబశివరావు తెలిపారు. మధిర తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ పునర్ నిర్మాణంలో తూము ప్రకాశరావు చేసిన కృషి అజరామరమని ఆయన మరణానంతరం కమ్యూనిస్టు పార్టీకి దన్నుగా నిలిచిన సుశీలమ్మ ధన్యజీవి అని ఆయన తెలిపారు. ఇటీవల మరణించిన బోనకల్ మండలం రాయన్నపేట మాజీ సర్పంచ్ సిపిఐ నాయకురాలు తూము సుశీలమ్మ సంస్మరణ సభ ఆదివారం రాయన్నపేట గ్రామంలో జరిగింది. తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పేదల హక్కుల కోసం ముఖ్యంగా భూ పంపిణీ కోసం ప్రకాశరావు చేసిన పోరాటంతో అనేక మంది పేదలకు భూములు దక్కాయని ఆయన తెలిపారు. కలకోట చెరువుపై హక్కులు పేదలకు చెందాలని ప్రకాశరావు తుదిశ్వాస వరకు పోరాడారన్నారు. ఆయన అమరత్వం తర్వాత సుశీలమ్మ గ్రామ సర్పంచ్‌గా, సిపిఐ నాయకురాలిగా కమ్యూనిస్టు పార్టీకి దన్నుగా నిలిచారని ఆ అమర దంపతుల వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి కుటుంబం కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలవడమే కాకుండా విభిన్న రీతిలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం, ఆదర్శనీయమని కూనంనేని తెలిపారు. ఈ సంస్మరణ సభ భవిష్యత్తు పోరాటాలకు నాంది పలకాలన్నారు. మారిన రాజకీయాల నేపథ్యంలో చట్టసభల్లో అడుగిడేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి కానీ ప్రజల పక్షాన పోరాడటంలో కమ్యూనిస్టులే ముందు వరుసలో నిలుస్తున్నారని సాంబశివరావు తెలిపారు. అధికారం లేకపోతే అనేక పార్టీలు తెరమరుగయ్యాయని అధికారం ఉన్నా లేకున్నా 100 సంవత్సరాల నుంచి ప్రజల మధ్యలో అజేయంగా నిలిచిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. సిద్ధాంత బలమే శతాబ్ద కాలంగా కమ్యూనిస్టు పార్టీని నిలబెడుతుందని కమ్యూనిజం అజరామరం, విశ్వ వ్యాప్తమని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ దాని ప్రజా సంఘాలు ఇప్పటికీ అలుపెరుగని పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. అధికారంలో లేకున్నా కమ్యూనిస్టులు తమ పక్షానే నిలుస్తున్నారని ఇందుకు సింగరేణి ఎన్నికల్లో గెలుపే నిదర్శనమన్నారు. పోరాట వారసత్వాన్ని కొనసాగించడమే సరైన నివాళి అని కూనంనేని తెలిపారు.



### సమాజ చైతన్యం కోసం పోరాడేది కమ్యూనిస్టులే : తాతా మధు

సమాజ చైతన్యం కోసం పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని బిఆర్ఎస్ అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు తాతా మధుసూదన్ తెలిపారు. సుశీలమ్మ సంస్మరణ సభలో తాతా మధుసూదన్ మాట్లాడుతూ తూము ప్రకాశరావు ది చరిత్ర కలిగిన కుటుంబమని సౌకర్యాలు లేని రోజుల్లో ప్రకాశరావు నిర్వహించిన సేవ నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. ఆయన ప్రజల కోసమే ప్రాణాలు అర్పించారని ఆయన తెలిపారు. ఖమ్మంజిల్లాలో కమ్యూనిస్టుల కారణంగానే రాజకీయ చైతన్యం వచ్చిందని ఆయన అన్నారు. ప్రకాశరావు కుటుంబ సభ్యులు, మనువలు సేవా వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ సభలో టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వివిధ పార్టీల నాయకులు చిదిరాల వెంకటేశ్వరరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, చింతలచెరువు కోటేశ్వరరావు, బత్తినేని చారిటబుల్ ట్రస్టు నిర్వహకులు బత్తినేని ప్రకాష్, ప్రకాశరావు, సుశీలమ్మల కుమార్తెలు బత్తినేని నీరజ, పారా వనజ, తూము రోషన్‌కుమార్, వట్టికొండ చంద్రమోహన్, యంగల ఆనందరావు తదితరులు ప్రసంగించగా వేదికపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బెజవాడ రవిబాబు, తాటి వెంకటేశ్వరరావు, ఏపూరి రవీంద్రబాబు, కాంగ్రెస్ నాయకులు రంగిశెట్టి కోటేశ్వరరావు, బత్తినేని నాగప్రసాదరావు, ఉమ్మనేని కోటయ్య, తాటి నిర్మల, బొమ్మినేని కొండల్‌రావు, వల్లెబోయిన జానయ్య, ఆకెన పవన్, జక్కుల రామారావు, ఏలూరి పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# దొరికిన తిమింగలం.. దొరకాల్సిన బినామీలు..!

(మొదటిపేజీ తరువాయి)

జీవన్‌లాల్ అందరిలా ఓ ఐఏఎస్ అధికారి అయితే ఇంతగా చర్చ ఉండేది కాదు. ఖమ్మంజిల్లాలో ఆయన ఓ రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి. భవిష్యత్తు రాజకీయాల మీద ఆశలు పెంచుకున్న వ్యక్తి కూడా. వైరా స్థానం కోసం అప్పటి వరకు కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నించిన జీవన్‌లాల్ తండ్రి రాములు నాయక్ వైరా స్థానం సిపిఐకి కేటాయించడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. సిపిఐ వ్యతిరేక శక్తులు కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలతో పాటు బిఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ ను వ్యతిరేకించే ఓ బిఆర్ఎస్ నేత మద్దతుతో రాములు నాయక్ విజయం సాధించారు. సాధించిన వెంటనే తనకు తోడ్పాటునందించిన వారితో కలిసి బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తండ్రి ఎంఎల్ఏ కావడంతో జీవన్‌లాల్ నియోజక వర్గంలో ఒక రకంగా రాజకీయ నాయకునిలాగానే వ్యవహరించారు. గ్రామాల్లో తిరుగుతూ నేరుగా కార్యకర్తలతో సంబంధాలు ఏర్పరచుకుని రాజకీయ కార్యకలాపాలు నిర్వహించారు. అధికారపు అడుగులకు మడుగులు వత్తే కొందరు పోలీస్ అధికారులు ఆయనకు ప్రోటోకాల్ నిబంధనలను సైతం వర్తింపజేయడమే గాక జీవన్‌లాల్ ఏమి చెబితే అదే చేశారు. ఇంత వరకు ఒక పార్శ్వం అయితే మరో వైపు ఆయన అవినీతి సంపాదన. జీవన్‌లాల్ అవినీతి సంపాదనపై అప్పుడే జిల్లాలో విస్తృతంగా చర్చ జరిగింది. లెక్కకు మించిన ఆస్తులు కొనుగోలు చేశాడని రాజకీయ వర్గాల్లో సైతం చర్చ సాగింది. గోవాలో జీవన్‌లాల్‌కు రిసార్ట్స్ ఉన్నాయో లేవో కాని జిల్లాలో మాత్రం వీటిపై పలు చోట్ల గుసగుసలు వినిపించాయి. వీటికి తోడు ఖమ్మంజిల్లాలో కొందరు రాజకీయ నాయకులు జీవన్‌లాల్‌కు బినామీలుగా ఉన్నారన్న వాదన వినపడుతుంది. గతంలో బిఆర్ఎస్‌లో ఉండి కాంగ్రెస్‌లో చేరిన కొందరి నేతలతో పాటు ఇప్పటికీ బిఆర్ఎస్‌లో ఉన్న కొందరు జీవన్‌లాల్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. రానున్న ఎన్నికల్లో వైరా నియోజకవర్గం తిరిగి రిజర్వు అయితే అక్కడి నుంచి లేదంటే మహబూబాబాద్ పార్లమెంటు నుంచి పోటీ చేయించాలని కొందరు ఉత్సాహపడడం వెనక జీవన్ లాల్ ప్రోత్సాహం ఉంది. అటు రాజకీయంగా, ఇటు అవినీతి పరంగా ఇప్పుడు జీవన్‌లాల్ జిల్లాలో చర్చనీయాంశమయ్యారు. సిబిఐ అధికారులు బినామీలపై దృష్టిసారించారన్న వార్తల నేపథ్యంలో ఎవరికి ఆయన అవినీతి మరక ఇక్కడ నేతలకు అంటుకుంటుందేమోనని వేదన పడుతున్నారు. అసలు నిజంగా బినామీలు ఉన్నారా ఉంటే వారి పేరున ఎక్కడ ఆస్తులున్నాయి అన్నది సిబిఐ దర్యాప్తు తర్వాతే తేలనుంది. మొత్తంగా ఖమ్మంజిల్లాలో రూ. 70 లక్షల లంచం రాజకీయ ప్రకంపనలకు, పరాకాష్టకు చేరిన అవినీతికి చర్చా వేదికైంది.

## మంత్రి శ్రీనివాసరెడ్డి విస్తృత పర్యటన

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. తొలుత మండలం లోని శంకరగిరితండా గ్రామంలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి కి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంగాపురంతండాలో నూతన వధువరులను ఆశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, బొందయ్య, ధీరావత్ భాలాజీ, దండా పుల్లయ్య, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/ఖమ్మం :** టేకులపల్లి మండలం లోని దాసుతండాలో నూతన వధూవరులు మౌనికవినోద్, మాధవిసంతోశ్‌కుమార్‌లను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతామధు, భద్రాద్రికొత్తగూడెం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ ప్రముఖులతో కలిసి హాజరై ఆశీర్వదించారు. మా జీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ భర్త హరిసింగ్ సోదరుడు పూల్‌సింగ్ కుమార్తెల వివాహవిందుకు వారి ఆహ్వానం మేరకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు అందజేశారు.



## మూగజీవాలకు ఆహారం అందజేత

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆకలితో నఖనఖలాడుతున్న మూగజీవాలకు ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు, బీఆర్ఎస్ సీనియర్ నేత దిండిగాల రాజేందర్ ఆహారం అందజేశారు. అడవుల్లో పండ్లు దొరకని పరిస్థితులు తలెత్తడంతో కోతులు ఆకలితో అలమటిస్తూ ఆహారాన్ని వెతుక్కుంటూ రోడ్లపైకి రావడంతో గమనించిన వారు మండలంలో దాసుతండాలో మాజీఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ హరిసింగ్ ఇంట్లో ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా రోళ్లపాడు అటవీప్రాంతంలో రోడ్డుపై ఆగి కోతులకు అరటిపండ్లు, పుచ్చకాయలు, మంచినీరు అందించి వాటి ఆకలిని, దాహార్తిని తీర్చారు.



# సిండికేట్ అంతా 'బాలాజీ' మయం..!

**ప్రజాపక్షం/ఖమ్మం :** టేకులపల్లి మండలంలో వైన్స్ నిర్వాహకులు సిండికేట్‌గా మారి మద్యం ధరలు పెంచేసి విక్రయిస్తున్నా..ఎక్సైజ్ శాఖ అధికారులు 'మామూలు'గా తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. వైన్స్‌లో అమ్మితే ఎంఆర్‌పీ ధరలకు అమ్మాల్సి వస్తుందని, మండలంలో రెండు వైన్స్ గోదాములు ఏర్పాటు చేసుకొని నాలుగు వైన్స్‌షాపుల యజమానులు ఒక సిండికేట్‌గా మారి మద్యంబాబులు అలవాటు పడిన బ్రాండ్లు అన్నీ వైన్‌షాపుల్లో లేకుండా చేయడంతో బ్రాండ్లకు అలవాటు పడిన మందుబాబులు బెల్ట్‌షాపులకు వెళ్లాల్సి వస్తోంది. మండలంలోని 36గ్రామపంచాయితీలో ఒక్కొక్క గ్రామపంచాయతీకి 20నుంచి 35బెల్ట్‌షాపులు వెలుస్తున్నాయి. సిండికేట్ బాస్ బెల్ట్‌షాపులకు బీర్, క్వాటర్‌లపై ఎంఆర్‌పీ కంటే రూ.25లు అదనంగా అమ్మితే బెల్ట్‌షాపుల యజమానులు బీర్, క్వాటర్‌లపై ఎంఆర్‌పీ ధరల కంటే రూ.50, ఫుల్‌బాటిల్‌పై ఎంఆర్‌పీ ధరలకంటే రూ.180 నుంచి రూ.200వరకు అదనంగా అమ్ముతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. టేదు నాలుగు వైన్స్‌షాపులపై తొమ్మిది నెలల క్రితం మండలంలోని ప్రజలు అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారని, కావాల్సిన బ్రాండ్లు వైన్స్ షాపుల్లో లేకుండా బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారని తిరగబడి వైన్‌షాపులను లూటీ చేయడంతో లూటీ చేసిన ప్రజలపై పోలీసులు, అబ్కారీ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ సంఘటన జరిగిన ఒక నెలపాటు అంతా నిశ్శబ్ధంగా ఉంది. మళ్లీ ఏమైందో ఏమో కానీ మన సిండికేట్ బాస్ ఏ అధికారులు, ఏ రాజకీయ నాయకులతో ముడుపులు ఎంతకు మాట్లాడుకున్నాడో గానీ మళ్లీ సిండికేట్ మూడు బీర్లు ఆరు క్వాటర్లుగా మారి వ్యాపారం విరాజిల్లుతోంది. మండలంలోని గ్రామాలలో బెల్ట్‌షాపులను సిండికేట్ బాస్ ప్రోత్సహిస్తూ మద్యంను మ్యాజిక్, ఆటోలలో తరలిస్తూ 24గంటలు బెల్ట్‌షాపులో మద్యం ప్రియులకు అందుబాటులో ఉండే విధంగా పురమాయిస్తున్నాడు. గతంలో కొంతమంది యువకులు ్థవకులు మండలంలో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారని జిల్లా అబ్కారీ శాఖ అధికారులకు ఫిర్యాధు చేయడంతో స్పెషల్‌స్క్వాడ్ జిల్లా అధికారులు మండలంలో ఒక వైన్‌షాపును తనిఖీ చేయగా మద్యం ధరలో తేడాలు, మద్యం నిల్వల్లో, అమ్మిన సరుకులో తేడాలుండటంతో ఆ మద్యం దుకాణాన్ని రెండు నెలలపాటు సీజ్ చేశారు. అయినాగానీ సిండికేట్ దందాకు మాత్రం అడ్డుకట్ట వేయకపోవడం ఏంటో అర్ధంకాని పరిస్థితి. ఇలా మండలంలో జరుగుతున్న సిండికేట్ దందా సంబంధిత ఎక్సైజ్ అధికారులకు తెలిసినా తమకేమీ తెలియదనే ధోరణిలో ఉండటం విశేషం. ఎవరైనా సిండికేట్ నిర్వహణపై అధికారుల దృష్టికి తీసుకెళ్తే లిఖితపూర్వకంగా ఫిర్యాధు ఇవ్వమని అంటున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఇలానే ఫిర్యాధులు చేసిన వారిపై దాడులు జరిగిన ఘటనలూ లేకపోలేదు. అంతేకాక అధికారుల అండదండలతో ఫిర్యాధు చేసిన వారిపై అక్రమకేసులు పెట్టించిన దాఖలాలున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా కొనసాగుతున్న మద్యం సిండికేట్‌పై దృష్టిసారించి మద్యంప్రియులు జేబులుకు చిల్లుపడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా జిల్లా ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.



# ఎప్‌సెట్ ఫలితాల్లో న్యూవిజన్‌దే అగ్రస్థానం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎప్‌సెట్ 2025 ప్రవేశాల కొరకు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పరీక్షల్లో ఖమ్మం నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల రాష్ట్ర స్థాయిలో ర్యాంకుల ప్రభంజనాన్ని సృష్టించి నెంబర్ వన్‌గా నిలిచిందని కళాశాల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 102, 109, 110, 168, 171, 210, 311, 456, 492, 525, 534, 583 వంటి ఉత్తమ ర్యాంకులు తమ కళాశాల విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు. తమ కళాశాల నుంచి ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో టి. సంహిత 102, ఎం. ఆకాంక్ష 109, ఆర్. సీతల్ 110, పి. ప్రణవ్ 168, ఆర్. షణ్ముకప్రియ 171, డి. అనన్య 210, ఎ. రోషిక్ మణిదీపక్ 311, ఎం. రోహన్ శ్రీహరి 456, జి. కార్తీక్ సాయి 492, ఎం. వైష్ణవి 525, ఎస్. స్రవంత్ 534, పి. భవిష్య 583, పి. రోహిత్ 586, మిన్‌హాజ్ ఆరా 719, కె. జశ్వంత్ రామ్ 755, ఎన్. భార్గవ్ సాయి 844, ఎస్. మానాస్విక్ 1046, సిహెచ్ సాయికృష్ణ 1076, ఆర్. గుణదీప్ 1185, కె. మధుర హాసిని 1230, బి. పీయూష్ వర్ధన్ రాథోడ్ 1270, ఆర్. కౌషిక్ 1340, జి. లలని చౌదరి 1383, డి. నరసింహ లక్ష్మి నివాస్ 1430, ఈ. వేద సంహిత 1461, ఎం. విశ్వక్ 1514, షేక్ అంజుమ్ 1622, డి. ప్రణీత 1751, జి. అనుప్రియ 1756, సిహెచ్ శ్రీహస్ 1757, ఎం. చరణ్ వెంకట్ 1840, వి. జయకాంత్ 1849, ఎం. శ్రీహిత 1860 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగం నుండి 616 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో ఐదువేల లోపు 131 మంది విద్యార్థులు 10వేల లోపు 184 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 1765, కేటగిరీలో 5వ ర్యాంకు, 99.8924843, 99 పైన 21 మంది విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్‌తో ఆలిండియా ర్యాంకులను కైవసం చేసుకుని అదే ఒరవడిని కొనసాగిస్తూ న్యూవిజన్ కళాశాల ఎప్‌సెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు పొందడం తాము అందిస్తున్న ఉత్తమ శిక్షణకు తార్కాణమన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్, డైరెక్టర్ సిహెచ్ గోపిచంద్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్ తదితరులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఎప్‌సెట్ ఫలితాల్లో హార్వెస్ట్‌కు అగ్రశ్రేణి ర్యాంకులు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో హార్వెస్ట్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి అగ్రశ్రేణి ర్యాంకులు సాధించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ సంస్థల యాజమాన్యం తెలిపింది. ఆదివారం ప్రకటించిన ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసి విభాగాలకు సంబంధించి తమ కళాశాల నుండి ఇంజనీరింగ్ విద్యకు 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా బి. సాయిచరణ్ 77వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. బి. సిద్దార్థ్ 193, ఎన్. రాఘవేంద్ర నవనీత్ 265, డి. శ్రీనివాస్ గౌతమ్ రెడ్డి 336, ఎం. నాగయశ్వంత్ 448, ఆర్. వెంకటసాయి వర్షిత్ 724, ఎన్‌సిహెచ్ యశ్వంత్ సాయి 958 ర్యాంకు సాధించారని వారు తెలిపారు. ఎంపిసి విభాగంలో ఐదువేల లోపు 20 మంది, 10వేల లోపు 26 మంది, 20వేల లోపు 50 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. వివిధ కేటగిరీలలో 30వేల లోపు ర్యాంకులు సాధించి 69 మంది టాప్ కళాశాలల్లో సీట్లు సాధించే అవకాశం ఉందన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 95 శాతం విద్యను అభ్యసించుటకు అర్హత సాధించారన్నారు. బైపిసి విభాగంలో జి. రాణి ఉమా అలైఖ్య 120వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు. టిడివిఎస్ఎస్ నయమంజరి 161, బి. భార్గవి 202, ఎండి అనిష ముష్కాన్ 232, సరోజ్ రాజ్ పురోహిత్ 384వ ర్యాంకు సాధించారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను హార్వెస్ట్ విద్యా సంస్థల కరస్పాండెంట్ బి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

# ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎప్‌సెట్ పరీక్షా ఫలితాల్లో ఖమ్మం శ్రీచైతన్య విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. శ్రీచైతన్య కళాశాల విద్యార్థి వి. కుషాల్ రాష్ట్ర స్థాయి 28వ ర్యాంకు, వై. నిషాంత్ రాష్ట్ర స్థాయి 61వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా శ్రీచైతన్య విద్యార్థులు డి. దుర్గ గుజిరి 222, ఎ. సాయితేజ 253, కె. శివాణి వాగ్దేవి 301, బి. రిషిత 321, ఆర్. జ్యోత్స్నవ్ కుమార్ 334, కె. సాయి విద్యావర్షిత 423, జి. సాయిప్రణవి 491, కె. హాసిని 575, వి. ప్రణతి 653, కె. తేజస్విని 653, బి. ఈశ్వర్ గుప్తా 855, యు. వశిష్ట్ 908, బి. మణిశేషు 968, డి. శ్రీలేఖ 1195, పి. స్మైలికారెడ్డి 1262, కె.నిషాంత్ రెడ్డి 1394, ఎల్. మనోహర్ 1422, జి. అక్షయ 1482 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. రాష్ట్ర స్థాయిలో 100 లోపు రెండు, 500 లోపు తొమ్మిది, 1000 లోపు ర్యాంకులు 15, 2000లోపు 24 ర్యాంకులు, 5000 లోపు 57, 10వేల లోపు 144 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న పరీక్షా విధానాలకు అనుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే తులనాత్మక విద్యాప్రణాళికతో పాటు రాష్ట్రంలో ఉత్తమ అధ్యాపకులచే విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు. నిరంతరం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించడం వల్లే తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల్లోనూ తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించగలుగుతున్నారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు బి. సాయిగీతిక, డిజిఎం సిహెచ్ చేతన్ మథూర్, ఎగ్జిక్యూటీవ్ డిన్ ఎన్‌ఆర్‌ఎస్‌డి వర్మ, డీన్ జే. కృష్ణ, ఎజిఎంలు సిహెచ్ బ్రహ్మం, జి. ప్రకాష్, జి. గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# ఎప్‌సెట్ ఫలితాల్లో రెజొనెన్స్ విజయభేరి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : తెలంగాణ ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఇంజనీరింగ్ ఫలితాల్లో రెజొనెన్స్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి విజయభేరీ మోగించారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో ఎ. జాహ్నవి 961, టి. బిందు 1364, బి. హన్సిక 1842, కె. జశ్వంత్ 2135, ఎం. సుమంత్ 2615, ఎ. నంద 3016, ఎం. ప్రేమ్ సాయి 4500, డి. హన్సిక 5005, బి. ఈశ్వర్ వెంకట్ 5034, బి. మాధవి 5855, ఐ. మణిదీప్ 6632, బి. ప్రసాద్ 7851, బి. భగత్ 8185, డి. ఉష్కశ్రీ 8268, జే. స్వాతి 8328 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు, ప్రిన్సిపాల్ సతీష్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు. పటిష్టమైన ప్రణాళిక అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, బోధన అనుభవం కలిగిన మేనేజ్‌మెంట్ కలిగి ఉండటమే ఈ విజయానికి కారణమని డైరెక్టర్లు తెలిపారు. ఇంటర్‌తో పాటు జేఈఈ, ఐఐటి, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఉత్తమ శిక్షణ నివ్వడం వల్ల అద్భుత ఫలితాలను సాధిస్తున్నట్లు వారు తెలిపారు. సాధారణ విద్యార్థులతో అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు.

# మంత్రి పొంగులేటికి సిపిఐ వినతి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఖమ్మంరూరల్ మండల పర్యటనలో భాగంగా పెద్దతండలో ఓ వివాహ వేడుకకు హాజరైన మంత్రిని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్, మండల సమితి సభ్యుడు దండి రంగారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏదులాపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న ఏఐటీయూసీ అనుబంధ సంఘం వర్కర్లకు ఎల్1 లిస్టులో అర్హత వచ్చినప్పటికీ, అధికారులు క్యాన్సల్ చేసినట్టుగా తెలిపారు. కార్మికులుగా పని చేస్తున్నారే తప్ప వారంతా కడు నిరుపేదలని, ఎల్1లో వచ్చిన అర్హత ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి పరిశీలన చేస్తామని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకుడు పొన్నెకంటి రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అనుముల నరేందర్‌రెడ్డి, సభ్యులు నారపాటి సునీత, ఆర్ నాగభూషణం, సిహెచ్ వెంకన్న, బీ. పిచ్చమ్మ, జి. లక్ష్మి , వి. కళ్యాణి, బి. ఉపేంద్ర, ఆర్ శ్రీశైలం, వి. రాంబాబు పాల్గొన్నారు.

# వరి దుబ్బులు కాలుస్తూ..కాలుష్యం పెంచుతున్నారు



ప్రజాపక్షం/ఖమ్మం : కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి పొలాల్లో వరి దుబ్బులు కాల్చుతూ కాలుష్యం చేస్తున్నారు. మండల పరిధిలోని చెన్నూరు, లింగాల,పెద్ద కోరుకొండి, పోచవరం, తాళ్లూరు, చిన్న కోరుకొండి, బత్తులపల్లి, పుల్లయ్య బంజర, కృష్ణయ్య బంజర, కల్లూరు, పేరువంచ, ముచ్చవరం, ఎర్ర బోయినపల్లి, వెన్నవల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు వరిపంట పొలాల్లో రైతులు అవగాహన లోపంతో వరి దుబ్బులను కాల్చుతున్నారు. దీనివలన కాలుష్యం పెంచుతున్నారు. రహదారుల ఇరువైపులా ప్రయాణికులకు రాకపోకలకు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. వరి దుబ్బులు కాల్చకుండా దమ్ములు చేసేటప్పుడు అవి మురిగి బలాన్నిస్తాయి. అవగాహన లోపం తో కాల్చుతున్నారు. అవగాహన కల్పించిన కూడా రైతులు వినకుండా వరి దుబ్బులకు పొలంలో మిగిలిన వరిగడ్డికి నిప్పు పెడుతున్నారు వ్యవసాయ శాఖ అధికారిని వివరణ అడగగా రైతులకు అవగాహన కల్పించిన కూడా అదే విధంగా కాల్చుతున్నారు. రైతుల్లో మార్పు రావాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

# ప్రభుత్వాసుపత్రిపై రెడ్‌క్రాస్ సింబల్స్



ప్రజాపక్షం/ఖమ్మం : కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి అంతస్తు పైన రెడ్ క్రాస్ సింబల్స్ ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి నవ్య కాంత్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం కారణంగా ముందు జాగ్రత్తగా జెనీవా ఒప్పందం కారణంగా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న రోగులు ప్రాణాలకు నష్టం లేకుండా ఉండేందుకు ప్రపంచ దేశాలు ఒప్పందం మేరకు ఆదేశాలతో ఆసుపత్రి పై రెడ్ క్రాస్ సింబల్ అధికారులు ఆదేశాలు మేరకు ఏర్పాటు చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు.

# అనారోగ్యంతో తల్లంపాడు విఆర్‌ఏ మృతి

## - నివాళులర్పించిన ఖమ్మంరూరల్ ఆర్ఐ ప్రసాద్



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడు గ్రామానికి చెందిన విఆర్ఏ షేక్ యాకుబ్(70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెవిన్యూ ఆర్ఐ ప్రసాద్ ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి..రెవిన్యూ ఆధ్వర్యంలో ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. అలాగే తహశీల్దార్ రాంప్రసాద్ ఆదేశాల మేరకు దహన సంస్కారాలకు రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో యువకుడి మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** జూలూరుపాడు గ్రామానికి చెందిన తెగిలిచర్ల రాకేష్ శర్మ (33) అరుణాచలంలోగుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. వివరాల్లో కెళితే.. తల్లి భవాని ని తీసుకుని రెండు రోజుల క్రితం రాకేష్ తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం దైవ దర్శనానికి వెళ్ళాడు. తల్లి కొడుకులు ఇద్దరు కలిసి గిరి ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆటోలో రూముకు వస్తుండగా రాకేష్ కు గుండెపోటు రావడంతో మృతి చెందాడు. రాకేష్ హైదరాబాద్ లో ఓ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతని తండ్రి మధు కుమార్ శర్మ పాపకొల్లు గ్రామంలో ఉమా సోమలింగేశ్వర స్వామి ఆలయ పురోహితుడిగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమారుడు, ఆరు నెలల కుమార్తె ఉన్నారు. మాతృ దినోత్సవం రోజున ఈ సంఘటన చోటు చేసుకోవడం విషాదాన్ని నింపింది. యువకుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం ఉదయం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో తన క్యాంప్ కార్యాలయం(ఆఫీస్) లో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగింది. ఒక్కరికి 1,00,116/ రూపాయలు చొప్పున 28 మంది లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కూడా ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని, ఆకాశంలో సగం కాదు.. "ఆమె" ఆకాశం సంక్షేమంలో సగం కాదు..''ఆమె" అగ్రభాగం, మహిళా సంక్షేమంలో.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన యావత్ భారత దేశానికే ఆదర్శం, అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి ఆరు పదులు దాటిన అవ్వల వరకు అందరినీ కంటికి రెప్పలా కాపాడింది మనసున్న మన రేవంతన్న కాంగ్రెస్ సర్కార్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ టి వాణి, ఆర్ఐ వీరాస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, చెక్కుల లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కారు బీభత్సం

**-వృద్దులపైకి దూసుకెళ్ళిన కారు**
**-డ్రైవర్ నిద్రమత్తు ప్రమాదానికి కారణం**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బుగ్గపాడు గ్రామం లో ఆదివారం ఎర్టిగా కారు బీభత్సం సృష్టించింది. ఇంటి బయట కూర్చుని మాట్లాడుకుంటున్న ఇద్దరు వృద్ధులపైకి కారు దూసుకెళ్ళటంతో తీవ్రగాయాల పాలయ్యారు వృద్దులు. డ్రైవర్ నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచలం నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, చింతల పూడి మండలం, లింగ గూడెం గ్రామానికి నూతన దంపతులతో వెళ్ళుతున్న ఎర్టిగా కారు బుగ్గపాడు గ్రామంలో ఇంటి బయట కూర్చున్న తాటి వీరమ్మ (65), గెడ్డం చెన్నప్ప (70) అనే ఇద్దరు వృద్ధుల పైకి దూసుకెళ్ళిందని దీంతో, ఇద్దరు వృద్దులకి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. చెన్నప్పకు రెండు కాళ్ళు విరగ్గా, వీరమ్మకు తీవ్ర గాయాలయ్యాయని తీవ్రంగా గాయపడిన ఇద్దరు వృద్ధులను హుటాహుటిన 108 వాహనంలో హాస్పటల్ కు తరలించారున. ప్రమాదానికి కారణం డ్రైవర్ నిద్రమత్తుతో ఉండటమేనని, డ్రైవర్ నిద్రలోకి జారుకోవటంతో ఒక్కసారిగా కార్ రోడ్ పక్కకు దూసుకెళ్లి ఇంటి ముందు కూర్చున్న వారిని ఢీ కొట్టటంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు.

## పేదలకు, ప్రజా పోరాటాలకు దిక్సూచి ఎర్రజెండా

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య**



**ప్రజాపక్షం/మణుగూరు:** పేద ప్రజలకు అండగా ఎర్ర జెండా నిరంతరం పని చేస్తుందని, వారి హక్కుల కోసం సిపిఐ పోరాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. ఆదివారం ఉదయం సమితి సింగారం పంచాయతీ పరిధిలో మాదాడి సురేష్ ప్రాంగణంలో వేర్పుల నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిత్యం సీపీఐ పోరాటాలు కొనసాగించామని, మణుగూరు అభివృధి లో సీపీఐ పాత్ర మరువలేనిదన్నారు. విపుల సింగారం ఖాళీ చేయించాలని, సింగరేణి అధికారులు మట్టి తీసుకొచ్చి ఊరు మీద పోయాలని చూస్తే కమ్యూనిస్టు పార్టీ అడ్డుపడి, పేద ప్రజల కోసం, గిరిజనుల కోసం పోరాడి, ఊరును కాపాడిన చరిత్ర సిపిఐ పార్టీదన్నారు. పేద ప్రజల కోసం ఎవరు పట్టించుకోరని, అధికారంలో వున్నా లేకున్నా పేద ప్రజల కోసం సీపీఐ పార్టీ గా పని చేస్తున్నమన్నారు. ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మవద్దని వారు హితవు పలికారు. కమ్యూనిస్టు పార్టీ నీ కాపాడు కోవాల్సిన బాధ్యత మీ అందరి మీద ఉందన్నారు. గెలుపు ఓటములు సహజమని సిద్ధాంతం కోసం నైతిక విలువలు కట్టుబడి పని చేయాలన్నారు. సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు మాట్లాడుతూ ఎందరో త్యాగమూర్తులు పార్టీ కోసం ఉన్న ఆస్తులను, భూములను త్యాగం చేశారని, పార్టీ కోసం నిలబడి జీవితాలను త్యాగం చేశారని, కాంగ్రెస్ పార్టీ కర్షకుల పక్షాన కార్మికుల పక్షాన పేదవారి గల పక్షాన నిరంతరం పోరాట కొనసాగిస్తూనే ఉంటుందని అలాంటి పార్టీలో పని చేయడం సంతోషమని ప్రజలు దీనిని ఆదరించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, సోందే కుటుంబరావు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, సిపిఐ సీనియర్ నాయకులు రూద్ర నాగరాజు, మహిళా సమైక్య మండల అధ్యక్షు కార్యదర్శులు బోలగని సమ్మక్క, దుబ్బాక నిర్మల, మాజీ వార్డు మెంబర్లు కమిటీ సత్యనారాయణ, వజ్జా వెంకటేశ్వర్లు, ఎఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, పులిగల రమేష్, జక్కుల రాజబాబు, యనమల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**మాతృ సంస్థలో చేరిన పోడుతూరి రాములు...**

సిపిఐ పార్టీలో గతంలో పని చేసి కొన్ని కారణాలవల్ల బయటకు వెళ్లిన పోడుతూరి రాములు తిరిగి సమితి సింగారం జనరల్ బాడీ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు అయోధ్య సమక్షంలో ఆదివారం తిరిగి పార్టీలో చేరారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం రోడెక్కిన నల్లివారిగూడెం గ్రామస్తులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** దమ్మపేట మండలం నాగుపల్లి పంచాయతీ నల్లివారిగూడెం గ్రామానికి చెందిన సుమారు వందమంది గ్రామస్తులు నాగుపల్లి ప్రధాని రహదారి మీద బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఇందిరమ్మ ఇల్లు కార్యక్రమంలో తమ గ్రామానికి తీవ్ర అన్యాయం జరిగిందని, తమ గ్రామంలో సుమారు 300 ఓట్లు ఉంటే తమ గ్రామానికి ఇందిరమ్మ ఇల్లు తక్కువగా కేటాయించారని, ఇందిరమ్మ కమిటీలో కూడా తమ గ్రామానికి సంబంధించిన ఒక సభ్యుడు కూడా చేర్చుకోపోవటంతో తమ గ్రామానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలియజేశారు. గ్రామానికి సరైన రహదారి కూడా లేదు అని దాని వలన రాత్రివేళలో గ్రామానికి తిరిగి వచ్చే వారికి విష సర్పాలు కరిచి ప్రమాదం జరిగిందని తక్షణం తమ గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించాలని రోడ్డుమీద బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారు. గ్రామస్తులు అందరూ కూడా ఎమ్మెల్యే వచ్చి తమకు ఖచ్చితమైన వాగ్దానం ఇస్తే కాని రోడ్డు మీద నుంచి లేచేదేలేదని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు అక్కడకు చేరుకుని గ్రామస్తులను సముదాయించి స్థానిక ఎమ్మెల్యేతో చరవాణి లో మాట్లాడించడం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో మాట్లాడిన తర్వాత ఎమ్మెల్యే ఖచ్చితమైన మాట ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకు విరమింప చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి పోరాట హక్కుల సమితి, తుడుం దెబ్బ సమితి సభ్యులు తంబళ్ల రవి పాల్గొన్నారు.

## సింగరేణి మండలంలో ఎంఎల్ఏ రాందాస్ నాయక్ విస్తృత పర్యటన

**-పలు శుభకార్యాలకు హాజరు.. పలువురికి పరామర్శలు**
**-అభివృద్ధి పనుల పరిశీలన**





**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో వైరా నియోజకవర్గ ఎంఎల్ఏ మాళోత్ రాందాస్ నాయక్ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మొదట పేరుపల్లి గ్రామ పంచాయితీలో ఏటుకూరి నర్సింహారావు, స్వరూప ఆహ్వానం మేరకు వారి కుమార్తె ప్రియాంక, వెంకటేశ్వర్లుల వివాహా వేడుకకు హాజరై, నవ వధువును ఆశీర్వదించారు. అదే విధంగా గుంపేళ్లగూడెం గ్రామ పంచాయితీకి చెందిన భూక్యా సైదులు, జంకు ఆహ్వానం మేరకు వారి కుమార్తె రాజేశ్వరి, వినోద్‌కుమార్‌ల వివాహా వేడుకకు హాజరై, నూతన వధువరులను ఆశీర్వదించారు. మాదారం గ్రామ పంచాయితీకి చెందిన కొల్లు వీరయ్య నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్గరామంలో ప్రతి వాడను కలియ తిరిగి గ్రామంలో ఉన్న ప్రధాన సమస్య సైడ్ డ్రైనేజ్‌ను పరిశీలించి, త్వరితగతిన నూతన డ్రైనేజ్ నిర్మాణం కోరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చరవాణి ద్వారా అధికారులను ఆదేశించారు. అదే విధంగా బుడగ జంగాల కాలనీలో నివాసం ఉంటున్న అందరి నిరుపేదల ఇళ్ళకు వెళ్ళి కలియ తిరిగి వారి జీవన స్థితి గతులను అడిగి తెలుసుకోని త్వరలో అందరికి ఇళ్ళు ఇస్తామని హామీ ఇచ్చారు. అదే గ్రామంకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కిలారి అప్పారావు జన్మదిన సందర్భంగా వారి ఇంటికి వెళ్ళి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదే గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు గుర్రం జయ క్రిష్ణ(కిట్టు) జన్మదినం సందర్భంగా స్థానిక చర్చ్ నందు కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలారి చంద్ర ప్రకాష్, నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, గుగులోత్ భీముడు, మల్లెల నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, మేదరి రాజా, ధారవత్ వినోద్, సురేందర్ మనియార్, తాజుద్దీన్, హరీఫ్, అజ్మీరా నరేష్, తోగరు శ్రీను, మాళోత్ భావుసింగ్, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సారథులు వస్తున్నారు..

**-గ్రామ సమాఖ్య అధ్యక్షురాల ఎన్నికలు పూర్తి**
**-జిల్లా, మండల సమాఖ్య ఎన్నికకు ఏర్పాటు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మహిళా సభ్యులుగా ఉన్న స్వయం సహాయక సంఘాలకు కొత్త సారథులను ఎన్నుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంఘ సభ్యుల నుంచే గ్రామ, మండల, జిల్లా సమైక్యలకు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షురాలను ఎన్నుకునే ప్రక్రియను ఈ నెలాఖరులోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు ఏపీఎంలు, సీసీలు శిక్షణ పొందిన అధికారులు గ్రామస్థాయిలో కొత్త సారథులు ఎన్నిక పూర్తి చేశారు.

### అవకాశం ఎవరిదో...

అధ్యక్ష ఉపాధ్యక్షురాలు ఎన్నికకు నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న సభ్యులకు సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా గానీ, చేతులు పైకి ఎత్తడం ద్వారా గాని, చిట్టీలు రాసి మద్దతు ప్రకటించడం వంటి మూడు పద్ధతిలో ఎన్నుకుంటారు. వీటిల్లో ఏదైనా ఒక విధానం ద్వారా అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్లను ఎన్నుకుంటారు. గ్రామంలోని స్వాయం సాయక సంఘాల నుంచి ఒకరిని గ్రామ అధ్యక్షురాలిగా, గ్రామ సంఘాల అధ్యక్షుల నుంచి మండల సమైక్య అధ్యక్షురాలుగా, మండల సమైక్య అధ్యక్షురాల నుంచి జిల్లా సమైక్య అధ్యక్షురాలుగా ఎన్నుకుంటారు.

### ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ...

జిల్లా సమైక్య అధ్యక్షరాలు ఎంపికకు ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన ఏపీఎంలో సీసీలు జిల్లాలోని వివిధ గ్రామాల్లో గ్రామ సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షురాలు ఎంపిక చేపడుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఈనెల ఆఖరి లోగా గ్రామ, మండల అధ్యక్ష ఎంపిక అనంతరం జిల్లా సమైక్య అధ్యక్షురాలు ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారు. చిరు వ్యాపారాల ఏర్పాటు చేసుకోవడంతో పాటు పొదుపు పాఠాలు అలవర్చుకుంటున్నారు. ప్రతినెల తప్పనిసరిగా వాయిదాల పద్ధతిన శ్రీనిధి రుణాలను బ్యాంకులో జమ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్ల పాత్ర ఎంతో కీలకమైనదిగా చెప్పవచ్చు.

### జిల్లా వివరాలు..

25100 / స్వయం సహాయక సంఘాలు,
1017/గ్రామ సంఘాలు, 20/మండల సమాఖ్యలు

**గ్రామ సమాఖ్య ఎన్నికలు పూర్తి :**
**సీసీ పెద్దపాక వెంకటేశ్వరరావు నేలకొండపల్లి**

గ్రామ సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు ఎన్నికలు పూర్తి చేశాం, మండల సమాఖ్య ఎన్నికకు ఏర్పాట్లు చేశాం.

### కొత్త వారికి అవకాశం...

**కుక్కల అనుష మండల సమాఖ్య సహాయ కార్యదర్శి.**

రెండేళ్లకోసారి గ్రామ, మండల, జిల్లా సమైక్యలకు అధ్యక్షురాలు ను ఎన్నుకుంటారు. ఎప్పుడూ ఒక్కరే కాకుండా కొత్తవారికి అందరికీ అవకాశం కల్పించాలి.

## క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయి..

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని, శరీర ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. మేడే సందర్భంగా సిపిఐ యూత్ ఆధ్వర్యంలో మల్కపురి శేఖర్ స్మారకార్ధకంగా నిర్వహించిన రెండు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి గెలుపొందిన ఆళ్లపల్లి ఆరిఫ్ ఎలెవన్ టీంకు 20000రూపాయలు, షీల్డ్, ద్వితీయ బహుమతి గెలుపొందిన సంపత్ నగర్ టీంకు 15000రూపాయలు, షీల్డ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లు క్రీడాకారులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ పుట్టి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మేడే కార్మికుల దినోత్సవం సందర్భంగా సిపిఐ పార్టీ, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో 38 జట్లు పాల్గొని స్నేహపూర్వకంగా ఆటలు ఆడారని వారందరికీ, మొదటి బహుమతి పొందిన ఆళ్లపల్లి టీంకు, ద్వితీయ బహుమతి పొందిన సంపత్‌నగర్ టీంకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే ఈ టోర్నీకి సహకరించిన వ్యాపారస్తులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. క్రీడల వలన శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని తెలిపారు. ఆటలలో గెలుపు ఓటములు సాధ్యమని స్నేహపూర్వకంగా ఆటలు ఆడుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యాపారస్తులు గౌరీశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నాగేశ్వరరావు, బూరుగడ్డ రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, సిపిఐ గుండాల మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షాహిద్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు కొమరం హనుమంత రావు, నరెడ్ల రాంబాబు, వజ్జ పగడయ్య, మాజీ జెడ్పిటిసి గొగ్గేలా లక్ష్మి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్కే రహీం, వార్డు సభ్యులు రేసు సురేందర్, ఏఐటియూసి మండల అధ్యక్షులు కుంట సహదేవ్, మండల నాయకులు దీకొండ మల్లేష్, యూనిస్, లాజర్, కసనబోయిన నరేష్, మద్దెల వెంకటేశ్వర్లు, రమేష్, క్రికెట్ మేనేజ్మెంట్ సభ్యులు ఆరీఫ్, కుంట నవీన్, సమీర్, సాయి, కందిమల్ల కుమారస్వామి, సత్యమోజు వినోద్, నిట్ట ప్రవీణ్, చింత చింటూ, దొంగరి మహేష్, వల్లాల పవన్, తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** జూలూరుపాడు మండల పరిధిలోని జూలూరుపాడు, గుండ్లరేవు, రాంపురం తండా, అనంతరంతో పాటు పలు గ్రామాల్లో జిల్లా కాంగ్రెస్ నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి , జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండ్లరేవు గ్రామం నందు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, టాస్ వేసి ఇరు జట్లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకన్నపాలెం మాజీ ఎంపిటిసి దుద్దుకూరి మధుసూదన్ రావు, టీపీసీసీ జిల్లా సోషల్ మీడియా ఛైర్మన్ నవీన్ రాథోడ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాయక్, మండల సేవాదళ్ అధ్యక్షులు వాంకుడోత్ కిషన్ నాయక్, మెంతుల కృష్ణ, బానోత్ బాలాజీ, కోర్సారమేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంసెట్ ఫలితాలలో బ్రిలియంట్ విద్యార్థుల విజయకేతనం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** స్థానిక సారపాక బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఆదివారం ప్రకటించిన తెలంగాణ ఎంసెట్ ఫలితాలలో మరొకసారి విజయకేతనం ఎగరవేశారు. ఇంజనీరింగ్ విభాగంలో ఏ రస్మితరెడ్డి 8688 ర్యాంకుతో 1వ ర్యాంకు సాధించగా, ఆర్ వినయ్ శరణ్ చౌదరి 11522వ ర్యాంకుతో 2వ ర్యాంకు సాధించారు. అగ్రికల్చరల్, ఫార్మసీ విభాగంలో సిహెచ్ స్వాతిక 20143వ ర్యాంకుతో 1వ ర్యాంకు సాధించగా, మరో నలుగురు విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో 25000లోపు ర్యాంకులన సాధించగా, అగ్రికల్చరల్, ఫార్మసీ విభాగంలో కూడా ముగ్గురు విద్యార్థులు 27000లోపు ర్యాంకులను సాధించి బ్రిలియంట్ విద్యార్థులు మరొక సారి సారపాక కీర్తి కిరీటాన్ని రాష్ట్ర స్థాయిలో నిలిపారు. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ మాట్లాడుతూ గ్రామీణ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు బ్రిలియంట్ కాలేజ్ నందు ఎంసెట్ కోచింగ్ తీసుకుని 99శాతం ఉత్తీర్ణత సాధించినందుకు మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఎంసెట్ ఫలితాలలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమెంటో ఇచ్చి బిఎన్ఆర్ అభినందనలు తెలిపారు. మంచి ఫలితాలను సాధించేందుకు సహకరించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ఈ సందర్భంగా డాక్టర్ బిఎన్ఆర్ ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తోలకాలు జరిపితే చర్యలు




**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, మట్టి అక్రమ రవాణా చేసినా, డంపింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అద్దంకి నరేష్, రెవిన్యూ అధికారి రమేష్ తెలిపారు. ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు, విక్రయం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం, అక్రమంగా నిల్వ చేయడం వంటి కార్యకలాపాలను నిరోధించేందుకు పోలీస్ శాఖ సహకారంతో దాడులు నిర్వహిస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణా కాకుండా ఉండడానికి చెక్ పోస్టులు పెట్టినా కూడా మండలంలో కొన్ని ప్రాంతాల్లో ఇసుక, మట్టిని ట్రాక్టర్ యజమానులు గుట్టు చప్పుడు కాకుండా తోలుతున్నారని సమాచారం అందించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్డీవో, మైనింగ్ అధికారుల అనుమతులు ఉన్న వారికి మాత్రమే ఇసుక రవాణా చేయడానికి, విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు. అనుమతులు లేని వారు ఇసుక రవాణా చేయడానికి, విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు. అనుమతులు లేని వారు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు పట్టా పొలాలు(భూములు)ఉన్నా కానీ అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. నాలుగు చక్రాల వాహనం ఉన్న వారికి తెల్ల రేషన్ కార్డు ఉంటే మాత్రం తీసివేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణా గురించి తెలిసిన వారు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## మండలంలో విస్తృతంగా పర్యటించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా



**ప్రజాపక్షం/ఖమ్మం :** అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం దమ్మపేట మండలంలో పలువురిని పరామర్శించారు. గండుగులపల్లి గ్రామంలో కోటగిరి బుజ్జి బాబు అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. అలాగే జూపల్లి ఉపేంద్ర బాబు అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట తుమ్మల లక్ష్మణ్ రావు, చీకటి శ్రీనివాస్ రావు, శ్రీపాద నాగు, మండవ సత్య, ఎల్లప్రోల సురేష్ తదితరులు ఉన్నారు.

# స్వార్థం లేనిది తల్లి ప్రేమ

**సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** స్వార్థం లేని ప్రేమకు తల్లి ప్రేమ ప్రతీక అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని రామవరం సెంటర్లో మదర్స్ డే సందర్భంగా జంజర్ల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి మొదటి స్నేహితురాలిని, మొదటి గురువని పేర్కొన్నారు. మాతృశక్తి లేనిదే సమాజం లేదని,. మహిళా శక్తి లేకుండా దేశ అభివృద్ధి జరగదని, తల్లుల అభివృద్ధే కుటుంబాల అభివృద్ధి, అదే దేశ అభి వృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కనిపెంచిన తల్లిదండ్రులు మరువవద్దని, వారిని కడదాకా కంటికిరెప్పలా కాపాడు కోవాలని సూచించారు. కార్యక్రమంలో కాపు సీతాలక్ష్మి, నాయకులు కంచర్ల జమలయ్య, జి.వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, ఎస్కె ఫహీమ్, పాటి మోహన్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, గురుమూర్తి, గోపి, తూముల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఖయూమ్, నగేష్, అంకూస్, సింగిరాల రమేష్, దాసు, జలీల్, రణధీర్, మర్రి కృష్ణ, విజయలక్ష్మి, దార లక్ష్మి, శంకర్, దాట్ల శ్రవణ్, అలీం, అనీఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వీరోచితుడు మధుసూధన్‌రావు

**సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివిరాఘవులు**




**ప్రజాపక్షం/కొణిజర్ల :** శారీరకంగా బలహీనంగా మనకు కనిపించే వ్యక్తి సైద్ధాంతికంగా ఎంతో గొప్ప పట్టుదల కలిగిన మనిషి పోరాటాల్లో జంకు, భయం లేకుండా వీరోచింతంగా పోరాటం చేయగలిగి ధైర్యసాహసం ప్రదర్శించగలిన వ్యక్తి సంక్రాంతి మధుసూధన్‌రావు అని సిపిఎం పోలిట్‌బ్యూరో సబ్యులు బివి రాఘవులు అన్నారు. మండల పరిదిలోని లాలాపురంలో సిపిఎం సీనియర్‌నాయకులు సంక్రాంత్రి మధుసూధన్‌రావు సంస్మరణ సభ ఆదివారం సిపిఎం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం అధ్యక్షతన జరిగింది. ఈసభకు ముఖ్య అతిధిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ఉద్యమాల్లో ఉన్న మనం ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని అటువంటి స్ఫూర్తికలిగిన కొంతమందిని కొత్తగా వ్యక్తులను మనం తయారు చేసుకొని ఉద్యమంలోకి తీసుకురావడం ఇప్పుడు మనం నిర్వహించాల్సిన కర్తవ్యం అని తెలిపారు. ఎన్ని సమస్యలు ఎన్ని ఉపద్రవాలు ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు వచ్చినా కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పార్టీ అభివృద్దికోసం మధుసూదన్‌రావు కృషిచేశాడని కొనియాడారు. కాలపరిస్థితులు బాగలేకపోయినా వాటిని ఎదిరించి పోరాడటం అనేది కమ్యూనిస్టు లక్ష్యం అని అన్నారు. అటువంటి లక్ష్య మధుసూదన్‌రావు లో ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం కేంద్రకమిటి సబ్యులు తమ్మినేని వీరభద్రం, కాంగ్రేస్‌పార్టీ పార్లమెంట్ సబ్యులు మల్లు రవి, వైరా మాజీ శాసన సబ్యులు బాణోత్ మదన్‌లాల్, సిపిఎం నాయకులు మందడపు సాయిబాబా, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బొంతు రాంబాబు, ఎం సుబ్బారావు, తాతా భాస్కర్‌రావు, కొప్పుల కృష్ణయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సబ్యులు యర్రా బాబు, తాళ్లల్లి కృష్ణ, చెరుకుమల్లి కుటుంబరావు, యాసా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్‌జెసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆర్‌జెసి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆర్‌జెసి డిగ్రీ కళాశాలలో 2000 2003 బియస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్బంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుంటూ సందడి చేశారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. విద్యార్థుల్లా మారి డ్యాన్సులతో హోరెత్తించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ హాజరై అనాటి జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్బంగా గుండాల కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. తమ కళాశాల నుంచి ఇప్పటి వరకు 25వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసించారని వారిలో పలువురు వివిధ రకాల ఉద్యోగాల్లో స్థిరపడటం సంతోషంగా ఉందన్నారు. తమ కళాశాల విద్యార్థులు సేవా రంగంలో కూడా ముందుంటారని తెలిపారు. ఆర్‌జెసి అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని విద్యార్థులు కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మ ణ్‌రావు, ప్రిన్సిపాల్ ఎ. లింగయ్య, పూర్వ విద్యార్థులు రామారావు, నాగమణి, చైతన్య, సుప్రియ, వెంకటేశ్వర్లు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ఆందోళన వద్దు

**-రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం**
**-కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శేఖర్ గౌడ్**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్ తెలిపారు. ఆదివారం జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను రైతులకు , ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సబ్సిడీపై రైతులకు ట్రాక్టర్లు, పనిముట్లను ప్రభుత్వం అందించనుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమంటేనే రైతు ప్రభుత్వమని ఆయన తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రె స్, మంత్రుల లక్ష్యమన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు పరం చేయాలని చూస్తుందని చాలా సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ రెండు ఒకటేనన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ తోటకూరి ప్రగతి, సత్తు వెంకటేశ్వర్లు, తూము కోటేశ్వరరావు, గజ్జి సూర్యనారాయణ, తోటకూరి హరీష్, ఎ. వెంకటేశ్వర్లు, తాళ్లూరి రమేష్, తన్నీరు పుల్లారావు, వంకాలయపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐలయ్యకు ప్రతిభ పురస్కారం




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండాకు చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయతి పంజాల ఐలయ్యకు శ్రీ శ్రీ కళా వేదిక సాహితీ ప్రతిభా పురస్కారం లభించింది. ఏలూరులో ఈ నెల 10,11 న శ్రీ శ్రీ కళావేదిక ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక మహాసభలు నిర్వహించారు. అందులో భాగంగా గతి తప్పిన గమ్యం అనే శీర్షికతో కవిత గానం చేసి ప్రతిభను కనబరిచినందుకు గాను నిర్వాహకుల చేత అందుకున్నారు. పురస్కారాన్ని గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యి బహుకరించారు. పురస్కారం లభించడం పట్లం పలువురు ఉపాధ్యాయులు, అభిమానులు అభినందనలు తెలిపారు.

# ఎప్‌సెట్‌లో కేతేపల్లి దర్శినికి రాష్ట్రస్థాయి ర్యాంకు



**ప్రజాపక్షం/మధిర :** మండల కేంద్రం మధిరకు చెందిన కేతేపల్లి దర్శిని ఈప్‌సెట్‌లో రాష్ట్రస్థాయి 4166 ర్యాంకు సాధించింది. మధిర ఆర్యవైశ్యులు కేతేపల్లి రాజశేఖర్ కుమార్తె నర్సరీనుండి 10వ తరగతి వరకు నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్ నందు విద్యనభ్యసించింది. రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించినందుకు నారాయణ విద్యాసంస్థల అధినేత బోనగిరి నారాయణరావు, వనజ, అధ్యాపక బృందం, ఆర్యవైశ్య సంఘాలు శ్రీవాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప అధ్యక్షుడు కురువెళ్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి నాళ్ల శ్రీనివాసరావు దర్శినిని అభినందించారు.

# ఉరేసుకొని మహిళ ఆత్మహత్య




**ప్రజాపక్షం/మధిర :** మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధిర మండలం మాటూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మాటూరు గ్రామానికి చెందిన మానుకొండ తిరుపతమ్మ (30) కుటుంబ కలహాలతో ఉరేసుకున్నదని తెలిపారు. తిరుపతమ్మ భర్త శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరులో ఉంటున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్సై రామారావుకు పలువురు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా నూతనంగా సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్(ఎస్సై)గా బాధ్యతలు చేపట్టిన పుప్పాల రామారావును కలిసి శుభాకాంక్షలు తెలిపిన వైరా కల్వ సుజాత ఆర్య వైశ్య అభిమాన సంఘం నాయకుడు గ్రంధి ప్రవీణ్ కుమార్, మిట్టపల్లి రాఘవరావు, జివివి.రవికుమార్, తాడికొండ రాము, మోరిశెట్టి జనార్ధన్, మైలవరపు శ్రీనివాసరావు, కొణతం రాజా తదితరులు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# కేఓసీలో బస్సు పునరుద్ధరించాలని ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/ఇల్లెందు:** కోయ గూడెం ఉపరితలగనిలో కార్మికుల సౌకర్యార్థం బస్సు పునరుద్దరించాలని ఎఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం మేనేజర్ పేరాల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటీయూసీ ఫిట్ సహాయ కార్యదర్శి మాట్లాడుతూ.. విధులకు హాజరుకావడానికి మూడుషిఫ్టలలో బస్సు సౌకర్యం ఉండేదని, దీనికి సంబంధిత టెండర్ గురువారంతో ముగిసిందని తెలిపారు. ఈమేరకు బస్సు కంపెనీ ఏర్పాటు చేయాల్సి ఉండగా జాప్యం చేయడంతో కార్మికులు గత మూడు రోజులుగా స్వంత వాహనాల్లో విధులకు హాజరవుతున్నారని కంపెనీ తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామల శ్రీనివాస్, కనకరాజు, ధల్‌సింగ్, ఉమామహేశ్వరరావు, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిబిల్ స్కోర్ పేరుతో వేదిస్తే ఊరుకోం..



**ప్రజాపక్షం/ఇల్లెందు:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసంపేర సబ్సిడీ ఇచ్చే రుణాలపై బ్యాంకు అధికారులు పెత్తనం చలాయిస్తూ సిబిల్‌స్కోర్ పేరుతో ఎస్సీ దరఖాస్తుదారులను వేధిస్తే ఊరుకోమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, దళితరత్న మేకల శ్యామ్ హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చే ఎస్సీ కార్పోరేషన్ రుణాల విషయంలో సబ్సిడీ పోను బ్యాంకు వారు ఇచ్చే సొమ్ముకు తగిన భద్రత చూసుకుని ఎస్సీ రుణాలు మంజూరుచేయాలని వివిధ బ్యాంకు అధికారులు కోరుతున్నారని, ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాధు చేశామన్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే కోరం కనకయ్యకు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఈడీ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ లకు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు.

# కొత్తతరహా ఇందిరమ్మ ఇళ్లు..!

- ఇటుకలు, ఇనుము లేకుండా నిర్మాణం
- షెర్‌వెల్ టెక్నాలజీతో ఇంటి నిర్మాణం
- ప్రభుత్వ ధరకే ఇల్లు పూర్తి
- ఆసక్తి చూపుతున్న జనం
- ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- తీరనున్న పేదల సొంతింటి కల







**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇల్లు కట్టాలంటే మామూలు ప్రయాస కాదు. సిమెంట్, ఇనుము, కూలీల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ క్రమంలో ఇంటి నిర్మాణ ధరలు సామాన్యునికి అందుబాటులో లేవు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షలు ఇస్తున్నప్పటికీ ప్రస్తుత ముడిసరుకు రేట్లతో ఆ డబ్బులతో ఇంటిని నిర్మించ లేకపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు సరిపోవడం లేదని, మరికొంత పెంచాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ఒకడుగు ముందుకేసి షేర్‌వెల్ టెక్నాలజీ నూతన పద్దతుల్లో అదే ధరకు ఇందిరమ్మ ఇంటిని సరి కొత్తతరహాలో నిర్మించి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

**కొత్తతరహాలో ఇందిరమ్మ ఇళ్లు...**

పేదలకు గూడు కల్పించాలనే సంకల్పంతో కొత్తతరహాలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో నూతన షేర్‌వెల్ టెక్నాలజీతో కూడిన ఇళ్లను పైలెట్ ప్రాజెక్టు క్రింద నిర్మించారు. ఈ ఇళ్లను లబ్ధిదారులకు చూపించి ఈ తరహా ఇళ్లు తమ ఇష్టపూర్తిగా నిర్మించుకుంటే నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెబుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ తరహా ఇంటిని కేవలం 15 రోజుల్లోనే పూర్తి చేసి అందిస్తారు. 30 ఏళ్ల వరకు మన్నిక ఉంటుంది. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు, విల్లాలు, బహుళ అంతస్థుల భవనాలు దేశవ్యాప్తంగా ఇదే తరహాలో నిర్మాణాలు చేపడుతున్నారు.

**ఇటుకలు, ఇనుము లేకుండా...**

కొత్తపద్దతుల్లో నూతన ఇళ్లు ఇటుకలు, ఇనుము లేకుండా నిర్మిస్తారు. షెర్‌వెల్ టెక్నాలజీ ద్వారా అల్యూమిలియం ఫ్రేమ్‌లు సిద్ధం చేసి వాటిలో కాంక్రీట్ నింపి గోడలు సిద్ధం చేస్తారు. దీంతో ఇటుకలు వాడే పని తగ్గుతుంది. మరో ప్రక్క ఇనుము పెద్దగా ఖర్చు కాదు. అదే విధంగా స్లాబ్ విషయంలో ఇదే తరహా పద్దతిని పాటిస్తారు. స్లాబ్ లెవల్లో రూఫ్‌కి షీట్ అమర్చి దానిపై ఇనుముతో మాములు స్లాబ్ వేసేలా నిర్మాణాన్ని చేస్తారు. ఆ తరావ్త 6 అంగులాల మందంలో కాంక్రిట్ వేసి స్లాబ్ పూర్తి చేస్తారు. ఇంటిలోపలి భాగంగా గోడలు నున్నగా ఉండేలా సిద్దం చేశారు. యూపివిసి గడపలు,తలుపులు,కిటికిలతో సిద్దం చేస్తారు. దీనికి ప్రభుత్వం ఇచ్చే రూ. 5 లక్షల సరిపోయే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా ప్రభుత్వం నిబంధనల ప్రకారం 400 నుండి 600 గజాల్లోనే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాలని ప్రభుత్వం చెబుతుండటంతో ఈ కొత్త టెక్నాలజీ అందుకు అనుగుణంగాఉంటుందని పలువురు నిపుణులు వాదన.

**ఆసక్తిచూపుతున్న జనం...**

షేర్‌వెల్ టెక్నాలజీలో ఇంటిని నిర్మించుకునేందుకు ఆయా జిల్లాల్లో జనం ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ విస్తీర్ణంలో అప్పులు చేసి ఇంటిని నిర్మించుకున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయమంటూ తేల్చి చెప్పడంతో తక్కువ సమయంలో అయిపోయే ఇలాంటి ఇంటిని కట్టుకుంటే మేలని అంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం షేర్‌వెల టెక్నాలజీ ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పైలెట్ ప్రాజెక్టు క్రింద నాలుగు జిల్లాల్లో ప్రవేశపెట్టగా ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుండటంతో రాష్ట్రమంతా దీనిని అమలు చేసేందుకు చూస్తున్నారు. ఆసక్తిఉన్న వారు షేర్‌వెల్ టెక్నాలజీ ఇంటిని కట్టుకుంటే ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా నిధులు విడుదల చేస్తుందని హౌసింగ్ కార్పోరేషన్ చెబుతోంది.

**తీరనున్న సొంతింటి కల...**

పక్కా గృహాన్ని నిర్మించుకోవాలనే పేద కోరిక కొత్తరక టెక్నాలజీతో తీరేలా ఉంది. నెలలకు నెలలు ఇంటిని కట్టే పనిలో ఉండకుండా, ఎక్కువ డబ్బులు ఖర్చు చేయకుండా ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే ఇల్లు పూర్తి కానుండటంతో పేదల సొంతింటి కల తీరుతుందని పలువురు నిర్మాణరంగ నిపుణులు అంటున్నారు. దేశంలో బహుళ అతస్తుభవనాలన్నీ ఇదే పద్దతిలో కడుతున్నట్లు చెబుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండటంతో త్వరలో షేర్‌వెట్ టెక్నాలజీతో కూడిన ఇళ్లను నిర్మించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్దం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## రేపు పాలీసెట్ పరీక్ష.. ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈనెల 13వ తేదిన నిర్వహించనున్న పాలీసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ జాన్‌మిల్టన్ ఆదివారం ఆయన "ప్రజాపక్షం" తో మాట్లాడుతూ మంగళవారం మొత్తం 719 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గం. నుండి మధ్యాహ్నాం 1 గం. వరకు జరిగే ఈ పరీక్షకు విద్యార్థులను 1 గం. ముందునుండే పరీక్షా కేంద్రానికి అనుమతిస్తామని చెప్పారు. కానీ ఒక్క నిమిషం ఆలస్యమైనా సెంటర్లోకి అనుమతి లేదన్నారు. హాల్‌టికెట్, హెచ్‌బి పెన్సిల్, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషేదం అన్నారు. హాల్‌టిక్కెట్‌పై ఫోటు సరిగా లేని విద్యార్థులు గెజిటెడ్ ఆఫీసర్ ద్వారా ఫొటోను ధృవీకరించుకోవాలని ఆయన చెప్పారు.

## జిల్లా 4వ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా ఎక్సే పాషా, కార్యదర్శిగా అజ్మీర రావరవి ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డివిజన్ 4వ తరగతి ఉద్యోగుల స ంఘం సమావేశంలో ఈ ఎన్నిక చోటు చేసుకుంది. నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

## భద్రాద్రి వాసికి కవిరత్న పురస్కారం



**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక నివాసి, ఉపాధ్యాయుడు తోటమల్ల సురేష్‌కు కవిరత్న పురస్కారం దక్కింది. ఈ మేరకు ఈనెల 10,11 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ సాహిత్యసంబురాల్లో కవితా గళం వినిపించడంతో నిర్వాహకులు కరవితర్న జాతీయ పురస్కారాన్ని అందించి సత్కరించారు. తోటమల్ల సురేష్ బాబు చర్ల మండలంలోని తేగడ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. తెలుగు సాహిత్యంపై కవితలపై ఆయనకు చిన్ననాటి నుండి ఉన్న మక్కువ అటుగా ప్రయాణం చేసేందుకు తోడ్పడింది. దీంతో ఏలూరులో జరిగిన కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా పురస్కారాన్ని దక్కించుకున్నారు. స్థానిక ఉపాధ్యాయునిగా కవిరత్న జాతీయ పురస్కారం దక్కడంతో తేగడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పివి రమణతో పాటు పలువురు అభినందించారు. ఇప్పటికే పలు పురస్కారాలని దక్కించుకున్న ఆయన భవిష్యత్‌లో మరిన్ని కైవసం చేసుకోవాలని ఆకాక్షించారు.

# అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలి

- సిపిఐ నేత ముత్యాల విశ్వనాథం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు తమవంతుగా సహకరించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. ఆదివారం సిపిఐ ప్రతినిధి బృంధం పాల్వంచ మండలంలోని దంతెలబోర, దంతెలబోర ఎస్సీ కాలనీ, సంగం, ఒడ్డుగూడెం, నారాయణరావుపేట, నాగారం, జగన్నాధపురం, బసవతారక కాలనీ, సోములగూడెం, లక్ష్మీ దేవిపల్లి, రేగుల గూడెం,తుమ్మలగూడెం, ఉల్వనూరు, మందెరకలపాడు, మొండికట్ట, కిన్నెరసాని, యానంబైలు, పునుకుల, పుల్లాయిగూడెం, ప్రభాత్‌నగర్, పాండురంగాపురం, సురారం తదితర గ్రామాల్లో పర్యటించి సిసి రోడ్లు, డ్రైన్లు, మంచినీటి పైప్‌లైన్లు, వాటర్ ట్యాంక్‌లు తదితర అభివృద్ధి పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు చొరవతో ప్రభుత్వం అతిపెద్ద మొత్తంలో కొత్తగూడెం నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న పనులే కాకుండా అవసరాన్ని బట్టి ప్రాధాన్యతా క్రమంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. గ్రామాల్లో నెలకొన్ని సమస్యలపై ప్రజలు తమకు తెలియజేస్తే వాటిపై కూడా ఎంఎల్‌కు వివరించి నింధులు మంజూరు చేయించుకుందామని, రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్క మౌళిక సమస్య లేకుండా తీర్చుకుందామని చెప్పారు. జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తునానార లేదా అనే దానిపే పర్యవేక్షణ చేయాలని, ఎక్కడి ఎలాంటి అవకతవకలు చోటు చేసుకున్నా వెంటనే ఫిర్యాదులు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్హత లేని గృహనిర్మాణ కార్మికులకు సర్టిఫికెట్ కోర్సు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎలాంటి విద్యార్హత లేని గృహనిర్మాణ రంగం వారికి నాక్ ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నేషనల్ అకాడమి ఆఫ్ కనస్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు ఆదివారం ఒక ప్రకటతనలో తెలిపారు. చేతి వృత్తులు చేసుకుని పెయింటర్స్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, రాడ్‌బేండర్స్, సుతారి మేస్త్రీలకు (రికగ్నేషన్ ఆఫ్ ప్రేయర్ లెర్నింగ్) నాక్ ఆధ్వర్యంలో ఒకరోజు ట్రైనింగ్ ఇచ్చి ధవీకరణ పత్రం అందించి ఎల్‌ఎన్‌టి వంటి నిర్మాణ రంగ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తద్వారా ఆర్థికంగా స్థిరపడే అవకాశం ఉంటుందని, ప్రభుత్వ కాంట్రాక్టులు కూడా అందించే సర్టిఫికెట్ ద్వారా చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. అంతే కాకుండా అవసరాన్ని నాక్ ఆధ్వర్యంలో విదేశాలకు పంపే వీలుంటుందని చెప్పారు. అసక్తి గల వారు మంగళవారం సాయంత్రం వరకు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాల కోసం 9704280412 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

**మూడు నెలల ఉచిత ల్యాండ్ సర్వే కోర్స్...**

నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తి చేసి వారికి మూడు నెలల పాటు ల్యాండ్ సర్వేయర్ కోర్సు నేర్పించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 15వ తేది లోపు తమ దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని ప్రగతి మైధానంలో గల నాక్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ కోర్సు నేర్చుకున్న వారు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ల్యాడ్‌సర్వేయర్లుగా విధులు నిర్వహించేందుకు వీలుంటుందని ,రూ.14500 చెల్లించి ఈ మూడు నెలల కోర్సులో స్త్రీ,పురుష అభ్యర్థులు చేరవచ్చన్నారు. పూర్తి వివరాలకు పై ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చని చెప్పారు.